# బరువు బ్రతుకు! ★

రచన:
వి. సాత్యకిరావు

"చూపు నా మీదకే రానున్నది
మనసు నీ మీదకే పోచున్నది
కారుచీకట్లు పగలే మూసెను
ఆశ పేరాశ అవబోతున్నది"

ఏమిటో పాడుకుంటూ పోతున్నాడు. ఎక్కడకు? ఎందుకు?

అతని జీవితంలో ఒక నిగూఢమైన రహస్యంవుంది. అతని జీవనస్రవంతి ఎత్తుపల్లాలమీదుగా, వంకరటింకరగా ప్రవహించింది. "రావు" విషాదజీవితం అందరికీ ఆశ్చర్యాన్నీ, ఆవేశాన్ని కలిగిస్తుంది. అర్థంకాని అతనిగాథ, కొందరికి బాధను కలిగిస్తుంది. రావు కమలను ప్రేమించాడు. ఆమె రావును నిరాకరించి, మేనమామను వివాహం చేసుకొంది. అంతే!

ఇక రావూ పిచ్చివాడయిపోయాడు. ఆపైగా 'దేవదాసు' సినిమాచూసాడు. అచ్చంగా దేవదాసులా తిరగటం ప్రారంభించాడు. దానికితోడు ప్రేమలేఖల్లోని రెండుపాటలు కంఠంతో పట్టాడు. ఇంకేముంది? భగ్నజీవిలా మారిపోయాడు!!!

"కమలలో ఏమంత గొప్పదనముందని ప్రేమించావురా?" అని ఒకరోజున 'అచ్చియ్య' అడిగాడు.

అచ్చియ్య అంతవక్రంగా ప్రశ్న వేస్తాడని రావు అనుకోలేదు. కమలలో తక్కువగా ఆకర్షించిన వస్తువేది? రావూ ఆలోచనలోపడ్డాడు.

లేతగులాబీలాంటి ఆమె చెక్కిళ్ళే, నల్లని కాటుక దిద్దిన కళ్ళా. సున్నితమైన హృదయమా, ఎర్రని శరీరం మీద జార్జెటుసిల్కుచీరలో కనుపించే ఆమెరూపమా? లేక ముచ్చటైన ఆమె పేరా? సందిగ్ధంలోపడ్డాడు.

ఈ లోకంలో నిండు హృదయంతో ప్రేమించే ఒకే ఒకవ్యక్తిని ఎందుకంతగా ప్రేమిస్తున్నావో చెప్పమంటే చెప్పలేకపోవటం, రావుకు బాధకల్గించింది. అంతేగాకుండా తన అశక్తత, అసమర్థతకూడా వెల్లడైంది.

"ఆమెలోని ప్రతి అవయవము నన్నాకర్షించినవి!" అని అన్నాడు చివరకు.

"ఓయ్ పిచ్చివాడా! ఆమెను ప్రేమించడానికి నీ దగ్గర అర్హతేమున్నది?" యీ ప్రశ్న రావుకు చిత్రాన్ని కల్గించింది.

"అర్హతా! ప్రేమించటానికికూడా అర్హతా! ప్రేమ బజారులో అమ్మేదికాదు, కొనేదికాదు. పవిత్రహృదయాల్లో పుట్టి స్త్రీ, పురుషుల్లో ప్రవహిస్తుంది. ఆమె స్త్రీ, నేను పురుషుణ్ణి! ఇదే అర్హత!" అన్నాడు రావు ఉద్రేకంతో.

"అయితే ఆమెకోసం నువ్వేం త్యాగం చెయ్యగలవ్?" యీ ప్రశ్న రావుకోపానికి దారితీసింది.

"ఏం కావాలంటే అది...నా తెలివితేటల్ని...నా జీవితాన్ని త్యాగంచేస్తాను. సరా!" అన్నాడు.

అచ్చియ్య చిరునవ్వునవ్వి "నీ జీవితాన్ని త్యాగం చేయమంటంలేదు. ఇప్పటి నీ పరిస్థితిచూస్తే త్వరలో అదే నిన్ను వదిలిపోయేలావుంది. అర్హతకావాలోయ్! తగిన అర్హత! వాళ్ళా ధనవంతులు! నువ్వు పేదవాడివి!" అన్నాడు.

"అర్హత నా దగ్గరేమీ లేదంటూరా? రచయితగా నా కున్న పేరుప్రఖ్యాతి చాలదా?" అన్నాడు రావు.

"చాలదు బ్రదర్! చాలదు!! ఇంతకూ నువ్వెన్ని కథలు వ్రాశావేంటి?"

"యాభై వ్రాశాను. ముప్ఫయి అచ్చయినవి. ఇరవై తిరిగొచ్చినవి."

"ఓస్! ఇంతమాత్రానికేనా!" అన్నాడు అచ్చియ్య యీసడింపుగా.

"ఇంకేం చెయ్యమంటావు చెప్పు?" అన్నాడు రావు జాలిగా.

"చేయమనేదేముంది, ఆమెకు వివాహమైపోయింది కాబట్టి ఆమెలు మర్చిపో! స్నేహితుణ్ణిగాబట్టి నేను నీకిచ్చే సలహా యిది. రేయింబవలు ఆమె నామజపంతో నీ జీవితాని కెందుకు ముప్పుదెచ్చుకొంటావు?"

"కాదు బ్రదర్! కమలకు నేనంటే ఎంతో ప్రేమ!"

"అయితేనేం ఆమె తల్లిదండ్రుల్ని ఎదురించి నడువలేకపోయింది. సమాజమంటే ఏమిటో ఆమెకు పూర్తిగా అర్థంగాదు. ప్రేమవిలువ అసలే తెలవదు. డబ్బున్నభర్త దొరికాడు. అందే ఆమెకు కావలసింది."

అచ్చియ్యమాటలు వింటుంటే రావుకు భయం వేసింది. తాను ప్రేమించిన స్త్రీ, తనకోసమేమీ త్యాగం చేయలేకపోయిందంటే రావు చాలా నిరుత్సాహపడ్డాడు.

"ప్రేమవిలు వెటువంటిదో, సమాజంలో బ్రతుకెటువంటిదో పూర్తిగా నే నామెకు ఉత్తరంలో వ్రాశాను బ్రదర్!"

"వ్రాస్తేమాత్రం ఆమె కర్థమయిందంటావా? నీ భావనాలేఖ! ఆమె చదివిందే ఘట్టుఫారం! విజ్ఞానం ఎక్కడనుంచొస్తుంది?"

రావుచెప్పే ప్రతిమాట అచ్చియ్య ఖండిస్తుంటే రావుకు తనబరువు బ్రతుకుపై వ్యామోహం తగ్గిపోయింది. అక్కడనుంచి లేచి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రావుజీవితంలో మార్పుకలిగింది. నిరాశతో, నిస్పృహతో తన బాధాజీవితాన్ని తలచుకుంటూ ఎన్నో వేడి కన్నీటిబిందువులు రాల్చాడు. తనలో కలిగిన మార్పువల్ల సంఘంలో ఏవిధంగా చూడబడుతున్నాడో గ్రహించుకొన్నాడు. తన బాధలన్నీ మరచిపోవటానికి మార్గమేమిటా అని ఆలోచించుకొన్నాడు. ఆనందంకోసం ఆచరణలను మార్చుకొన్నాడు.

సిగరెట్ అంటే ఏమిటో ఎరుగని రావు సునాయాసంగా సిగరెట్ కాల్చసాగాడు. రావు తన బాధా జీవితాన్ని మరచిపోవటానికి దురలవాట్లకు లోనయ్యాడు. వ్యభిచారం, త్రాగుడు, జూదం మొదలైన దురభ్యాసాలతో తన జీవితాన్ని యింకా అగాధంలో పడేసుకొన్నాడు.

ఆ రోజున రావు బాగా మైకంలో తూలుతూ, రైలు కట్టమీదుగా వస్తున్నాడు.

"జహాఁదీప్ జల్తాహై
వహీఁ భ్రమర్ ఉడ్‌తాహై!"

అంటూహిందీపాటరాగంతోపాటు అందుకొన్నాడు. రావుశరీరం స్వాధీనంలోలేదు. పాడేది బాధాన్వితమైన భగ్నజీవిపాటలు! వచ్చేది జనతా ఎక్స్‌ప్రెస్!!

రావుపాట అంతకంతకూ ఎక్కువవుతోందిగాని తగ్గటంలేదు. రావుపాటకన్నా వేగంగా ఎక్స్‌ప్రెస్ వచ్చేస్తుంది. రావులో చలనంలేదు. ఇంజన్ ఎడతెరిపిలేకుండా కూతవేస్తోంది. రావు తప్పుకుంటా డనుకున్నారు పాపం! 'ప్రేమపిచ్చి'తో ప్రపంచాన్ని మరచి, మరల వాట్లతో భస్మమయ్యే రావుకు తప్పుకునే శక్తివుందా?

బండి సడన్‌గా ఆగిపోయింది. "అబ్బ! ఘోరం! చూడలేం!" అని బండిలోని జనమంతా కళ్లు మూసుకొన్నారు. చలనంలేని రావుశరీరాన్ని ఆహుతిగొని బండి ఠపీమని ఆగిపోయింది. రావు తన బరువు బ్రతుకు నీడ్వలేక యీ లోకాన్నే వదిలి వెళ్ళిపోయాడు. జనతా బయలుదేరి గుప్పుగుప్పున వెళ్ళిపోయింది. ఇంకా యీ విధంగా ఎంతమంది భగ్నజీవులను బలిగొంటుందో! ఏమో?

కమల రావును కదన్నా, అతని జీవితాన్ని చదివిన మీరైనా రెండు వేడి కన్నీటిబిందువులు రాల్చండి!!!

# రజతోత్సవం

మైసూర్ ఇండస్ట్రియల్, టెస్టింగ్ లేబరేటరీ రజతోత్సవం డాక్టర్ ఏ. లక్ష్మణస్వామి మొదలియార్‌గారిచే మార్చి 18 వ తేదీన బెంగుళూరులో ప్రారంభించబడింది. మైసూరు ప్రభుత్వం ప్రముఖ మంత్రి శ్రీ ఎస్. నిజలింగప్పగారు ఈ మహోత్సవాలకు అధ్యక్షత వహించారు. డాక్టర్ బి. వెంకటసుబ్బారావుగారు అతిధులను ఆహ్వానిస్తూ ఉపన్యసించారు. సందేశాలను శ్రీ ఎస్. ఎమ్. రామకృష్ణరావుగారు చదివారు. కంపెనీ రిపోర్టును డాక్టర్ ఎమ్. శివరామ్‌గారు సమర్పించారు. డాక్టర్ బి. కె. నారాయణరావుగారి చిత్ర చిత్రపటాన్ని అధ్యక్షులు ఆవిష్కరించారు. శ్రీమతి పార్వతీ మహదేవన్ పార్టీవారి పాట కచేరీ జరిగింది. శ్రీ బి. ఎన్. గుప్తగారు వందన సమర్పణ జరిపారు.

